మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి

- అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు
- ఫిన్లాండ్ దేశంలో విద్యా వ్యవస్థ అధ్యయనం గొప్ప అనుభవం
- విద్యాశాఖ రాష్ట్ర స్థాయి వీసీలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర కార్యదర్శి యోగితా రానా, వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

**గద్వాల ఏప్రిల్ 30,ప్రభాతవార్త:** అక్షరాస్యత పరంగా వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ తెలిపారు. పాఠశాలల్లోమౌలిక వసతులు, 99రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే విద్య వారోత్స వాలు, తదితర అంశాలపై గురువారం హైదరాబాదు నుంచి విద్యాశాఖ రాష్ట్ర కార్యదర్శి యోగితా రానా సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026/ 2027 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 2700 ప్రభుత్వ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యం లేని పాఠశాలలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటర్, పదో తరగతిలో ఫెయిల్ అయిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు అడ్వాన్సుడ్ సప్లి మెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అదేవిదంగా ఈ కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో మే 11వ తేదీ నుంచి వారోత్సవాలను నిర్వహించడం జరుగు తుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో శంకుస్థాపనలు చేయించాలన్నారు. విద్యార్థులు,వారి తల్లిదండ్రులను,ప్రజాప్రతినిధులను, అధికారులను భాగస్వాములు చేస్తూ విద్యా శిబిరాలు, వర్క్ షాప్‌లు, బడిబాట, తదితర కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యా వారోత్సవాలకార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవలే ఫిన్లాండ్ దేశంలో విద్యా వ్యవస్థను అధ్యయనం చేసేందుకు జోగులాంబ గద్వాల జిల్లాకలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, విద్యాశాఖ అధికారుల బృందాన్ని అక్కడికి పంపించినట్లు చెప్పారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించేందుకు సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. విద్యాశాఖ అధికారులతో కలిసి ఇటీవల తాను ఫిన్లాండ్ వెళ్లిన అనుభవాలను కలెక్టర్ తెలియజేశారు. ఫిన్లాండ్ దేశంలో ఐదు రోజులపాటు వివిధ విద్యాసంస్థలను సందర్శించామన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా తరగతి గదులతో పాటు ఆవరణలోని అడుగడుగునా విద్యకు సంబంధించిన అంశాలను ప్రదర్శిస్తున్నారన్నారు. తొమ్మిదో తరగతి తర్వాత ఎవరైనా సరేవృత్తి విద్యాకోర్సులు అభ్యసించేందుకు అక్కడ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ప్రతి తరగతి గదిలో సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన ఒక టీచర్ తో పాటు మరో ఇద్దరు సహాయ ఉపాధ్యాయులు కూడా బోధన చేయడం చూశామన్నారు. తరగతి గదితో పాటు మైదానంలో, విద్యాసంస్థకు సంబంధించిన అన్ని విభాగాల్లో గోడ గడియారాలు ఉండడంతో చాలా చోట్ల బెల్ కు ప్రాధాన్యత ఉండదన్నారు. అంటే విద్యార్థులు తమ టైం టేబుల్ అనుసరించి క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తున్నారన్నారు. డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా అక్కడ ఏడవ తరగతి నుంచి విద్యార్థులకు లాప్టాప్ లను అందిస్తున్నారన్నారు. విద్యార్థులు

## బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో
# రైతులకు పెద్దపీట

- చెక్ డ్యామ్ కూల్చి వేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి
- దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



చెక్‌డ్యాం కూల్చివేతకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతులకు పెద్దపీట వేసిందని, నిర్మించిన చెక్ డ్యామ్లను కాపాడి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బస్వాపూర్ చెరువు దగ్గర బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన చెక్ డ్యామును ఇసుక మాఫియా గుర్తుతెలియని దుండగులు చెక్ డ్యామ్ ని కూల్చి వేయడానికి ప్రయత్నించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గురువారం సాయంత్రం చెక్ డ్యామ్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభు త్వంలో ప్రతి గ్రామంలో కూడా చెక్ డాంలను ఏర్పాటు చేసి, రైతులకు ఎంతో మేలు చేసింది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ నాయకులు తమ అక్రమ సంపాదన కోసం అక్రమంగా ఇసుకను తరలించేందుకు చెరువులో నీరు ఉండటంతో చెరువు దగ్గర ఉన్న చెక్ డ్యామ్ నీ కూల్చివేస్తే ఇసుకను అక్రమంగా తరలించి డబ్బును సంపాదించడానికి చెరువుల దగ్గర ఉన్న చెక్ డ్యాంలోనే కూల్చి వేయడానికి సిగ్గుచేటు అన్నారు. రైతులకు పంటలు ఎల్లప్పుడూ సాగు చేసుకునేందుకు చెరువులకు, చెరువుల దగ్గర ఎల్లప్పుడూ నీరు ఉండేందుకే చెక్ డ్యామ్లను ఏర్పాటు చేశాము. చెక్ డ్యామ్ కూల్చివేసేందుకు ప్రయత్నించిన వారిపై జిల్లా పోలీసులు వారిపై కఠిన చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేయాలి ఆయన డిమాండ్ చేశారు. అనంతరం దేవరకద్ర పోలీస్ స్టేషన్ లో మాజీఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నర్సింహారెడ్డి, మండల నాయకులు శ్రీకాంత్ యాదవ్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దొబ్బలి ఆంజనేయులు, బస్వాపూర్ మాజీ సర్పంచ్ హనుమంతు, సదానంద్, బాలకృష్ణ,కరణం రాజు, బాలరాజు,చల్మారెడ్డి, రాధాకృష్ణ, మండల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి

## మొక్కజొన్న కొనుగోళ్లలో..
# నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

- జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లను సకాలంలో పూర్తి చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలుపై మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల అధికారులు, జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పరిపాలన చర్యలు ముమ్మరం చేసింది ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన మొక్కజొన్నను వేగంగా కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు తేమ శాతం పరీక్షలను పారదర్శకంగా నిర్వహించా లని తెలిపారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుం డా టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఉన్న 18 జిన్నింగ్ మిల్లుల్లో మొక్కజొన్నను కొనుగోలు చేసి నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిల్వ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గిడ్డంగులు సరిపోకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సమయానికితరలించకపోతే సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అందుకు రవాణా ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా అవకతవకలు లేదా నిర్లక్ష్యం చోటు చేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలను వివరించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచి కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా పనిచేసేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పెంచాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డు

- మహబూబ్‌నగర్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ తొలి సమావేశంలో అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ కుష్బూ గుప్తా



కలెక్టర్ కుష్బూ గుప్తాను కలిసిన జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్30, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకి అక్రిడేషన్ కార్డు అందించేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుష్బూ గుప్తా అన్నారు.మహబూబ్‌నగర్ జిల్లా మీడియాఅక్రిడేషన్ కమిటీ (డిఎంఎసి ) తొలి సమావేశం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమిటీ చైర్మన్, కలెక్టర్ కుష్బూగుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అక్రిడేషన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా అర్హులైన జర్నలిస్టులకు జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ ద్వారాఅక్రెడిటేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సమాచార శాఖ,సహాయ సంచాలకులు (డిపిఆర్ఓ)శ్రీనివాస్ జర్నలిస్టుల అక్రిడేషన్ ప్రక్రియ, మార్గదర్శకాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేసే విధానం, అర్హతలు, పారదర్శకతపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో సాగి,తొలి మీటింగ్ విజయవంతంగా పూర్తయ్యింది.అతి త్వరలోనే కమిటీ రెండవ సమావేశం నిర్వహించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కార్డుల జారీ ప్రక్రియపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు, ఎండి జాకీ, కె.భాస్కర్‌రావు,పి.రవికుమార్,చింతకాయల వెంకటేష్,యాదిలాల్,భాస్కరాచారి,ఎన్.సతీష్ కుమార్‌రెడ్డి, కాటం నాగరాజుగౌడ్, కె.విజయ్ పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం

- ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి
- బస్వాయిపల్లిలో ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం





గృహప్రవేశం చేసిన వారికి నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** పేదల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామంలో కురువ కృష్ణమ్మ సాయిలుకు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇంటి యజ మానులకు శుభాకాంక్షలు తెలియజేసి, కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను –మిగతా4లో..

# సెట్విన్‌తో మహిళలకు ఉపాధి కల్పించే దిశగా కృషి

- రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



సెట్విన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి డా. శ్రీహరి

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** సెట్విన్‌తో వేలాది మంది మహిళలకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలోని సెట్విన్ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సెట్విన్ లో టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ ,కంప్యూటర్ ట్రైనింగ్ విభాగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలను నేరుగా కలుసుకొని, వారి శిక్షణ తీరు తెన్నులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. సెట్విన్ రాకతో మక్తల్ పట్టణంలోనే మహిళలకుస్వయం ఉపాధి పొందేందుకు మార్గం సుగమయిందని అన్నారు. టైలరింగ్ తో పాటు అన్ని విభాగాల్లోని మహిళలకు రాబోయే రోజుల్లో హైదరాబాద్ నుంచి పెద్ద పెద్ద కంపెనీలను తీసుకువచ్చి, వారికి నేరుగా ఉపాధిని మక్తల్ లోనే అందించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అమరచింతలో ప్రత్యేకంగా షెడ్యూల్ నిర్మించి హైదరాబాద్ నుంచి కంపెనీల ద్వారా మహిళలకు ఉపాధి అందిస్తున్నామని తెలిపారు. మక్తల్‌లో సైతం పెద్దపెద్ద షెడ్లు నిర్మించి మహిళలకు ఉపాధి అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని విద్యార్థులకు యూనిఫామ్‌లను కుట్టే ఉపాధిని సెట్విన్‌లో శిక్షణ పొందేవారికి అందించి, వారికి భరోసా కల్పిస్తామన్నారు. మక్తల్ ను రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సెట్విన్ లో అన్ని ప్రాంతాల నుంచి ఆర్డర్లు తీసుకొని వచ్చి ఇక్కడి మహిళలు స్వయం ఉపాధి పొందే లాగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి ఒక్కరూనాణ్యమైన శిక్షణ పొందిఆయా విభాగాల్లో నిష్ణాతులుగా తయారు కావాలని సూచించారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరికి సెట్విన్ ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ విజయ్ కుమార్, టైలరింగ్ ట్రైనర్ ఫర్జానా, బ్యూటీషియన్ ట్రైనర్ స్వప్న, మగ్గం వర్క్ జర్దోసి ట్రైనర్ వీరమ్మ, కంప్యూటర్ ట్రైనింగ్ ట్రైనర్ తిమ్మప్ప, సిబ్బంది ప్రవీణ్, బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి, జి.లక్ష్మారెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీవిద్య నీలాగౌడ్, కో ఆప్షన్ మెంబర్ బి.శంషుద్దీన్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గాయత్రి అనిల్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ పసుల రంజిత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపొర్లలో రూ.2.30 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

**నారాయణపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా చిన్నపొర్ల గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మధ్యాహ్నం 2:00 గంటలకు రాష్ట్ర మంత్రివర్యులు డా. వాకిటి శ్రీహరి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రూ.2.30 కోట్ల విలువైన రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు, పెద్దపొర్ల, చిన్నపొర్ల గ్రామాలను కలిపే వారధి బ్రిడ్జి రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయగా,ఆ పనులను మంత్రి ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఈ అభివృద్ధి పనులు ఎంతో ఉపయోగపడతాయని రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నపొర్ల సర్పంచ్ గాండ్ల నికిత ప్రశాంత్, పెద్దపొర్ల సర్పంచ్ బోయినపల్లి కాశమ్మ, చిన్నపొర్ల మాజీ సర్పంచ్ మాలిపటేల్ రవీందర్ రెడ్డి, ఉట్కూరు మండలం మాజీ జడ్పిటిసి సూర్య ప్రకాష్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఎంపీడీవో, తహసిల్దార్, పీఆర్ డీఈ, ఏపీఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ కృషి

- స్కిల్ డెవలప్‌మెంట్ కింద 18 కోర్సులు
- తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** నారాయణపేటలో ఎమ్మెల్యే క్యాంప్‌కార్యాలయంలో నిర్వహించినకార్యక్రమంలో 550 మంది అర్హులైన మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంఅన్ని వర్గాల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత రెండేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, రాబోయే కాలంలో మరిన్ని పథకాలు అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా పేద ముస్లిం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నామని, ఇంకా పొందని వారికి కూడా త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. స్కిల్ డెవలప్‌మెంట్ కింద 18 రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయని, మహిళలు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో టీఎంఆర్ ఈఎస్ పాఠశాలలు విజయవంతంగా నడుస్తున్నాయని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను టీఎంఆర్ఈఎస్ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించాలని కోరారు విధవలు, విడాకులు పొందిన మహిళల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. తుర్కా కోష ద్వారా రూ.12 కోట్లతో జనరేటర్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.అలాగే స్కూటర్ల పంపిణీ, విదేశీ విద్య అవకాశాలపై కూడా వివరాలు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, మైనారిటీ అధికారి రషీద్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు మైముద్ ఖురేషి, మహమ్మద్ గౌస్, ఖజా సాబ్, మమ్మద్ ఖాజా, మహమ్మద్ రఫీ, కుతుబుద్దీన్, అబ్దుల్ ఖదీర్, సర్ఫరాజ్ అన్సారి తదితరులు పాల్గొన్నారు.

# నేడు మెగా జాబ్ మేళా

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్
- జాబ్ మేళాలో పాల్గొననున్న రాష్ట్ర మంత్రులు



అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**వనపర్తి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర యువజన, క్రీడల శాఖ, పరిశ్రమలు, ఐ.టి.మంత్రిశ్వాఖల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం లో మొట్ట మొదటి సారిగా మెగా జాబ్ మేళాను నేడు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శిల్పారామంలో నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ గురువారం ప్రకటనలో తెలిపారు.నేడు నిర్వహించబోయే జాబ్ మేళా, తెలంగాణలోనే తొలి మెగా జాబ్ మేళా అని తెలిపారు. మెగా జాబ్ మేళాలో సుమారు 100 ఐటి, నాన్ ఐటి,ఫార్మా ,ఇతర కంపెనీలు పాల్గొని విద్యార్హతలు ననుసరించి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తారని,అదే రోజు సాయంత్రం ఎంపికైన అభ్యర్థులకు నియామక ఆఫర్ లెటర్ లు అందజేస్తారని తెలిపారు.10 వ తరగతి పెయిల్ అయినవిద్యార్థుల నుండి బి.టెక్.,ఫార్మా, ఇంటర్, డిగ్రీ, పి.జి. చదివిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా యువత మెగా జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో 37స్థానిక కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ నుండి రిజిస్ట్రేషన్ చేసుకొని నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. శిల్పారామంలో 30 రిజిస్ట్రేషన్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నట్లు, రిజిస్ట్రేషన్ డెస్క్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని అభ్యర్థులు వారి విద్యార్హతలు బట్టి ఏర్పాటు చేసిన 100 కంపెనీలలో స్టాల్‌లలో వారికి ఇష్టమైన కంపెనీలో ఇంటర్వ్యూ కు హాజరు కావచ్చని తెలిపారు. కంపెనీలు స్టాల్ నెంబర్‌లు కేటాయించి వాటివివరాలు ఫ్లెక్సీలద్వారా ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు అదే రోజున నియామక ఆఫర్ లెటర్ అందచేయడం జరుగుతుందని తెలిపారు.

## పింఛన్ కోసం
# ధన్వాడలో రాస్తారోకో

- నెల చివరైనా జమ కాక పోవడంతో ఆగ్రహం
- గతంలోలాగే ఆలస్యం అవుతుందేమోనని లబ్ధిదారుల ఆందోళన





పింఛన్ ఆలస్యమవడంతో ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు

**బస్సులో ఫోన్ మరిచిపోయిన ప్రయాణికులు తిరిగి అందజేసిన కండక్టర్ చిన్నమ్మ**

**కండక్టర్‌ను అభినందించిన బస్టాండ్ కంట్రోలర్ గంధం జాన్ రాజ్**



ప్రయాణికురాలికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

**వనపర్తి రూరల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సులో ఫోన్ మరిచిపోయి వెళ్లిన ప్రయాణికురాలికి (ఉద్యోగికి )తిరిగి అప్పగించి ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు. వివరాలు ఇలా.. గురువారం ఉదయం వనపర్తి నుంచి గద్వాల్ వెళ్తున్న బస్సులో వనపర్తి మెడికల్ కళాశాలలో పని చేస్తున్న ఉద్యోగి ప్రయాణించారు. అయితే వనపర్తి బస్టాండ్ నుంచి బయలు దేరిన ఉద్యోగి మర్రికుంట వద్ద ఫోన్ మరిచి బస్ దిగిపోయారు. కొద్ది సేపటికే తేరుకొని ఆందోళన చెందారు. వెంటనే ఆమె పాత్రికేయులు బొడ్డుపల్లి లక్ష్మణ్ ద్వారా వనపర్తిరూరల్ ఎస్ఐ.రిషికేశ్‌ని సంప్రదించడంతో లోకేషన్ కనిపెట్టి కండక్టర్ ద్వారా ఫోన్‌ను తిరిగి అప్పగించడంతో కండక్టర్ చిన్నమ్మను పలువురు అభినందించారు.అలాగే సహకరిం చిన రూరల్ ఎస్ఐ రిషికేశ్ ,వనపర్తి బస్టాండ్ కంట్రోలర్ గంధం జాన్ రాజ్, పాత్రికేయులు బొడ్డుపల్లి లక్ష్మణ్‌కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## వడగళ్ళ వానతో వరి పంట నష్టం

**రైతులను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్**


పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**దామరగిద్ద, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని గడిమున్కన్‌పల్లి గ్రామంలో అకాల వర్షం, వడగళ్ళు, ఈదురుగాలులతో వరి పంట తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో సీపీఎం నాయకులు నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మద్దూరు ఏరియా కార్యదర్శి గోపాల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ దాదాపు 150 ఎకరాల వరి పంట నాశనమైందని తెలిపారు. రైతులు ఎంతో కష్టపడి, అడవి పందులు మరియు చీడపీడల నుండి కాపాడుకున్న పంట కోతకు సిద్ధమైన సమయంలో వడగళ్ళ వాన కారణంగా నేలమట్టమైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లిపోయారని పేర్కొన్నారు. వెంటనే రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి, ఎకరానికి కనీసం రూ.50 వేల పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తమ వినతిపత్రాన్ని తహసీల్దార్ తిరుపతయ్యకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహేష్ కుమార్ గౌడ్, రైతులు వెంకటప్ప, సబాప్ప, మహబూబ్, భీంషప్ప తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్‌కు 7 రోజుల జైలుశిక్ష


డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు జిల్లా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన మొత్తం 5 మందిని గుర్తించి, గురువారం సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి ఆర్.శశిధర్ ఎదుట హాజరు పరచగా నలుగురు ద్విచక్ర వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించగా, ఎక్కువ మోతాదు మద్యం మత్తులో డీసీఎం వాహనం నడిపిన డ్రైవర్‌కు గౌరవ న్యాయమూర్తి 7 రోజుల జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండటంతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా భారీ వాహన డ్రైవర్లు మరింత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

## అంగన్వాడి పిల్లలకు ఏకరూప దుస్తులు పంపిణీ


ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ఐసిడిఎస్ బలమూరు ప్రాజెక్ట్ పరిధిలోని ఉప్పునుంతల మండలంలోని అంగన్‌వాడి కేంద్రాలలో చదువుకుంటున్న చిన్నారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శిశు సంక్షేమ శాఖ వారి సౌజన్యంతో అందించిన ఏకరూప దుస్తులను ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలికవసతులు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సిడిపిఓ దమయంతి,గ్రామ సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్‌లు బిపాసా, స్వప్న, మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాలలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

**ఒకే సారి కూలీల సంఖ్య తగ్గడంతో విచారణ చేపట్టిన డిఆర్‌డిఓ ఎపిడి శ్రీనివాసులు**


దాసర్లపల్లి లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డిఆర్డిఓ ఎపిడి శ్రీనివాసులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ఉపాధి పనులకు భారీగా కూలీల సంఖ్య తగ్గడంతో డిఆర్‌డిఓ ఏపీడి శ్రీనివాస్ విచారణ జరిపారు.మండలంలోని దాసర్లపల్లి, ఉప్పునుంతల, అయ్యవారిపల్లి గ్రామాలలో ఉపాధి కులీల సంఖ్య గత సంవత్సరం కన్నా ఈసారిఒకేసారి కూలీల సంఖ్య తగ్గడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండలంలోని దాసర్లపల్లి, ఉప్పునుంతల గ్రామాలలో డిఆర్‌డిఓ ఎపిడి విచారణ జరిపారు. గత రెండు వారాల క్రితం ఉన్న ఉపాధి కూలీల సంఖ్య ఒకేసారి ఇంత సంఖ్య తగ్గడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది.ఈ వారం గ్రామాలలో అత్యధికంగా శుభకార్యాలు ఉన్నందున ఏదేమైప్పటికీ గ్రామాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పనులకు మొగ్గు చూపడం లేదని, కూలీల సంఖ్యను పెంచాలని స్థానిక అధికారులకు ఎపిడి ఆదేశించారు. అదేవిధంగా గ్రామాలలో ఉపాధి పనులు సక్రమంగా జరిగే విధంగా చూడాలని వారికి ఆదేశించారు. కూలీలకు సౌకర్యాలు కల్పించాలని కూలీలు ఏపిడి ముందు వాపోయారు. డిఆర్‌డిఓ ఎపిడి శ్రీనివాసులుతో పాటు ఎంపిడిఓ వరుణ్ తేజ, సర్పంచులు బోధన పల్లి రమేష్ రెడ్డి, చింత గాళ్ళ శ్రీనివాసులు,ఉప సర్పంచులు అంతటి శైలజ వెంకటయ్యగౌడు, పొన్నగంటి శంకర్, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, ఇసి కుర్మా రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మల్లేష్, సుఖ జీవన్, పంచాయతీ కార్యదర్శులు పవన్, వెంకటేష్, దాసర్లపల్లి సీనియర్ మేట్ భూషణ్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## విత్తన డీలర్లతో అవగాహన కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి

**గద్వాల ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** గద్వాల మండల వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో విత్తన డీలర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ జారీ చేసిన లైసెన్స్ ఉన్న వారు విత్తన క్రయ విక్రయాలకు అర్హులని, తప్పనిసరిగా సీడ్ స్టాక్ రిజిస్టర్ లో విత్తన వివరాలు నమోదు చేయాలని, స్టాక్ బోర్డు తప్పని సరిగా ప్రతి షాపు ముందు అన్ని వివరాలతో ఉంచాలని, కాలం చెల్లిన లేదా నకిలి విత్తనాలు అమ్మినవారి పై కఠిన చర్యలు ఉంటాయని, రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని విత్తన డీలర్లకు సూచించారు. అనంతరం గద్వాల టౌన్ ఎస్ ఐ కళ్యాణ్ మాట్లాడుతూ. డీలర్లు నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలని, ఎక్కడైన లూస్ విత్తనాలు గాని, నకిలీ విత్తనాలు గాని అమ్మినట్లు తమకు తెలియజేస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, డిటి అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను

# కర్తవ్యంగా నిర్వహించాలి


రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

**పెద్దమందడి,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** గురువారం పెద్దమందడి మండల పరిధిలో పర్యటించిన అదనపు కలెక్టర్ జగత్‌పల్లి గ్రామం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పౌర హక్కుల దినం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పౌర హక్కుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ కీలక సూచనలు చేశారు. ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకొని సమాజ అభివృద్ధికి సహకరి ంచాలని అనంతరం ఆయన మణిగిల్ల చిన్నమందడి వెల్టూర్ పెద్దమందడి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం నిర్వహణపై ఆరా తీసి రిజిస్టర్లు పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా,వేగవంతంగా నిర్వహించాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్రాల ఇన్చార్జిలకు ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం స్వీకరణలో నిబంధనలు కచ్చితంగా పాటించి పాటించాల్సిందిగా సూచించారు. పెట్రోల్‌బంకుల పరిశీలన అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్ క్షేత్రస్థాయిలో ఇంధనం సరఫరా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా కొత్తకోట, వెల్టూరు ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులను ఆయన తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులు నిలువలు సరఫరా విధానం రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎందన సరఫరా నిరంతరం కొనసాగాలని డీలర్లకు సూచించారు. అలాగే నాణ్య త ప్రమాణాలు పాటిస్తూ పారదర్శకంగా ఇంధన విక్రయాలు నిర్వహించాలని ప్రభుత్వ మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని డీలర్లకు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీఎస్ఓ కాశీ విశ్వనాథ్, తహసిల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో పరిణయం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలు.. బాల్యం భద్రంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

**గద్వాల ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మాహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో గురువారం గట్టు మండలం, గోర్లఖాన్ దొడ్డి గ్రామంలోని రైతు వేదికలో సైబర్ నేరాలు, పిల్లల భద్రత, రక్షణ, అనాథ పిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా కలెక్టర్ నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న కారణాలతో విద్యను మధ్యలో ఆపకూడదని, చదువే భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. రాబోయే తరాలు బలంగా ఎదగాలంటే, దేశం అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గమని తెలిపారు.అలాగే, బాలికలు ఎలాంటి అవాంఛనీయ ప్రభావాలకు, ఆకర్షణలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టం వ్యర్థం చెయ్యరాదని కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనేక నష్టాలు కలుగుతాయని, అలాంటి వివాహాలు నిర్వహించిన తల్లిదండ్రులు,బంధువులు,పురోహితులు, టెంట్‌హౌస్ నిర్వాహకులు,సరఫరాదారులు, ఫోటోగ్రాఫర్లు, సహకరించిన వారందరూ చట్టపరమైన చర్యలకు లోనై జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. బాల్య వివాహాల తో శారీరక, మానసిక ఎదుగుదల కుంటు పడుతుందని దీని ప్రభావం రాబోయే తరాల పైన, దేశ ఆర్థిక వ్యవస్థ పైన ప్రభావం చూపుతుందని అన్నారు, చరవాణి వినియోగాన్ని అవసరానికి తగిన విధంగా వాడడం వలన మోసాలను అరికట్టవచ్చని ,ప్రలోభలకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా బాలల సురక్షిత అసురక్షిత పరిస్థితులపైన,బాలల సంరక్షణపై,దురలవాట్లను దరి చేయనీయకుండా ఉండడం,మొదలైన అంశాలపైన వీడియోస్ ప్రదర్శన నిర్వహించారుఅనాథ,నిరాధార,విడిచిపెట్టబడిన పిల్లల వివరాలను సేకరించి,వారికి విద్యలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన సహాయాన్ని అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి అధికారి సునంద, ఎంపీడీఓ చెన్నయ్య, డీసీపీఓ నరసింహ, ఎస్సై శేఖర్ గౌడ్, సర్పంచ్ స్వేత, పంచాయతీ కార్యదర్శి రవి, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కిరన్, చైల్డ్ లైన్ సూపర్వైజర్ నవీన్, హబ్ కోఆర్డినేటర్ సరోజ, గ్రామస్థులు బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆడపిల్లలను రక్షిద్దాం.. బాల్య వివాహాలు నిర్మూలిద్దాం



181 పోస్టర్ విడుదల చేస్తున్న తహసిల్దార్ తదితరులు

**లింగాల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ఆడపిల్లలను రక్షి ద్దాం బాల్య వివాహాలు నిర్మూలిద్దామని లింగాల తహసిల్దార్ బి.వెంకటేష్ అన్నారు.గురువారం లింగాలమండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 18సంవత్సరాల్లోపు ఆడపిల్లలకు 21సంవత్సరాల్లోపు మగపిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అన్నారు.ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే 2006 బాల్య వివాహాల నిషేధ చట్టం ప్రకారం లక్ష రూపాయలతో పాటు రెండు సంవత్సరాలు జైలుశిక్ష విధించడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో బాలల హక్కులు కాపాడేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.ఆడపిల్లలపై లైంగిక వేధింపులు పాల్పడితే ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణ కోసం181 అందుబాటులో ఉంటుందని అన్నారు. బాలల రక్షణ కోసం 1098 సమాచార ఇస్తే వెంటనే వారిని ఆపద నుండి రక్షి ంచి ఆదుకుంటారని అన్నారు. గ్రామాల్లో పేద పిల్లల కోసం ప్రతి విషయంలో ఏ ఆపద వచ్చినా 100 తెలియజేస్తే వెంటనే వారిని చేరదీసి సంబంధిత అధికారులకు తెలియజేస్తారని అన్నారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లలతో పనులు చేయించరాదని సూచించారు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ గిరిజ, సఖి సెంటర్ న్యాయవాది సరిత, హబ్బు కోఆర్డినేటర్ అనిత,చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కేస్ వర్కర్ ప్రమీల,సామాజిక కార్యకర్త శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు గీతా, రాధా, పుష్పలత, ఉమా, కళావతి, మంజుల, మహమ్మద్, బి. సువర్ణ, స్వాతి తోపాటు వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభించిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

**పాల్గొన్న శాంతినగర్ సిఐ శంకర్, ఎస్సై నాగ శేఖర్ రెడ్డి**



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అలంపూర్ మాజీ ఎమ్మెల్యే

**వడ్డేపల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మున్సిపాలిటీ కేంద్రం నందు చలివేంద్రం ప్రారంభించిన అల్లంపూర్ మాజీ శాసనసభ్యులు ఏఐసిసి కార్యదర్శి డా.ఎస్.ఏ సంపత్ కుమార్ నేటి నుంచి వేసవికాలం అంతా చలివేంద్రాల వద్ద మజ్జిగ సరఫరా (సార్) ఫౌండేషన్ సహకారంతో ముందుగ మజ్జిగ పంపిణీ చేసి చలి వేంద్రాల్ని సంపత్‌కుమార్ ప్రారంభించారు.అల్లంపూర్ నియోజకవర్గం అంతట దాదాపు 20కి పైగా చలివేంద్రాల ఏర్పాటు చేసే విధానంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్లో ఒక ఫౌండేషన్‌ని ప్రజాసేవ కొరకు స్థాపించి ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాలను ప్రారంభించడం జరిగింది. మానవ సేవే మాధవ సేవగా భావించి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు సంపత్ కుమార్ తెలిపారు. ఈ చలివేంద్రాల వద్ద ఈ వేసవికాలం అంతా కూడా మజ్జిగ పంపిణీ ఉంటుందని ఎండ తాకిడి నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవాల్సిందిగా వారికి సూచిస్తూ ప్రజాశ్రేయస్సుకు ప్రజాసేవకు ఎల్లవేళలా ముందుంటానని సంపత్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, వడ్డేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంగారు రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ చిన్నిబాబు, ఎనుముల నాగరాజు, యోగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, మండల, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లలకు ప్రీ స్కూల్లో సంరక్షణ


ఉప్పునుంతలలో అంగన్ వాడీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైద్య అధికారిణి డా. స్వప్న

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలకు ప్రీ స్కూల్లో నే ఉంటుందని తహసీల్దార్ అద్దంకి సునీత, వైద్య అధికారిణి డా. స్వప్న పేర్కొన్నారు. గురువారం ఐసిడిఎస్ బల్మూర్ ప్రాజెక్టు పరిధిలోని ఉప్పునుంతల మండల స్థాయి గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రైతు వేదికలో ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్‌లో తత్తత కార్యక్రమం, సమన్వయ సమావేశం, అంగన్‌వాడి సేవలు తదితర అంశాలపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు, ఆరోగ్యలక్ష్మి, భోజనం, పిల్లలకు నిర్వహించిన, నిర్వహించబోయే తదితర అంశాలు ,ప్రణాళిక, వాటి జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రీస్కూల్ కార్యక్రమాలు ప్రీస్కూల్ నుంచి ప్రాథమిక పాఠశాలకు సంసిద్ధత అలాగే ముగింపు రోజైన గురువారం అన్ని అంగనావాడీ కేంద్రం నుంచి అంగన్‌వాడీలకు సంబంధించిన ప్రీస్కూల్ పిల్లలకు దుస్తులు పంపించడం జరిగింది.ఈకార్యక్రమంలో తహశీల్దార్ అద్దంకిసునీత,మండల వైద్యాధికారిణి డా.స్వప్న,ఐసిడిఎస్ అధికారులు స్వప్న,బిపాసా,నాగర్ కర్నూల్‌జిల్లా ఐసిడిఎస్ అధికారులు, మండలం లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, తల్లులు, ప్రీస్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

## మామిళ్ళపల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జయంతి సందర్భంగా గురువారం మండలంలోని మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బిజెపి పార్లమెంటు అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మహిమగల శ్రీ లక్ష్మీనరసింహస్వామి అని అన్నారు. నియోజకవర్గంలోనే ప్రాచీన కాలం నాటి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. ఆయనతోపాటు బిజెపి నాయకులు వావిలాల రమేష్, ఏళ్ళ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లింగాల నూతన ఎస్సైగా చంద్రకాంత్



**లింగాల,ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** లింగాల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం. చంద్రకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరిం చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వెంకటేశ్వర్ గౌడ్ పెబ్బేరుకు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో గద్వాల ఏఆర్ నుంచి ఇక్కడికి వచ్చిన సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నేరాల నియంత్రణలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు.

## వెల్టూర్‌లో పౌరహక్కుల దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** గ్రామాలలో అంటరానితనం నిర్మూలించాలని, మూఢనమ్మకాలను విడనాడాలని సూచించారు. గురువారం మండలంలోని వెల్టూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఆలయ ప్రవేశం, అనంతరం ఆలయంలో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ బాల్ రాం నాయక్ ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ఉప సర్పంచ్ ఉప్పరి మల్లయ్య, జిపిఓ రమేష్, గుద్దటి బాలరాజు, ఉప్పరి బాల్ రాజు, గోస్కె బాల్ రాజు, జంగయ్య ,మాజీ ఎంపిటిసి సర్వేశ్వర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

**మండల విద్యాధికారి మురళీకృష్ణ**

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ఉమ్మడి జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శుక్రవారం జిల్లా కేంద్రంలో జాబ్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజులలో భాగంగా ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న యువతీ యువకులు తమ విద్యార్హత కలిగిన పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు. మండలం నుంచి పెద్ద ఎత్తున యువతీ యువకులు పాల్గొనాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలోని శిల్పారామంలో వంద కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారని ఆయన తెలిపారు. యువతీ యువకులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు పెద్దమందడికి ఎమ్మెల్యే రాక



**పెద్దమందడి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** నేడు శుక్రవారం పెద్దమందడి మండల కేంద్రానికి వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి రానున్నట్లు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ తెలిపారు. ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేయడానికి హాజరవుతున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

## హిందూ ఆత్మీయ సమ్మేళనం కరపత్రం విడుదల

**రేవల్లి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** రేవల్లి మండలం నాగపూర్ గ్రామంలోనిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమం కరపత్రాలను మాజీ జడ్పిటిసి సభ్యులు భీమన్న, రేవల్లి మాజీ సర్పంచ్ శివరాం రెడ్డి, నాగపూర్ మాజీ సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్ రెడ్డి, మాజీఎంపీటీసీ యాలాల చంద్రయ్య, మాజీఎంపిటిసి దొడ్డి శ్రీశైలం, పెద్దలు నాగం ప్రతాపరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరహరిలు విడుదల చేశారు. అదే విధంగా ఈ కార్యక్రమం వచ్చే నెల ఆరవ తేదీన జరగనుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఉపాధి పనుల పట్ల ఆరా..


ఉప్పునుంతల గ్రామ పంచాయతీలో మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీడి శ్రీనివాసులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామ పంచాయతినీ డిఆర్‌డిఓ ఏపీడి శ్రీనివాసులు సందర్శించారు. గ్రామపంచాయతీలో గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల పట్ల ఆరా తీశారు. కూలీల సంఖ్య పెంచే విధంగా గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు సహకరించాలని ఎపిడి కోరారు. మస్టర్ల ను పరిశీలించారు, అనంతరం గ్రామ సర్పంచ్ తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ ఏపీ డి శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఎపిఓ పర్వతాలు, ఇసి కుర్మారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సుఖ జీవన్, అంతటి శేఖర్ గౌడ్‌లు ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

**ఆత్మకూర్ ఏప్రిల్ 30, ప్రభాతవార్త;** సమాజంలో విద్యార్థిని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యను అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని శ్రీవాణి పాఠశాల అకాడమిక్ అడ్వైజర్ టీజే విశ్వేశ్వర్ విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీవాణి పాఠశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు దీప్తి 579 మార్కులు, ఎస్కె బోజు 572 మార్కులు, అనుకి 575 మార్కులు సాధించి పదవ తరగతి ఫలితాల్లో సత్తా చాటడంతో పాఠశాల యాజమాన్యం తరఫున విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సన్మానం చేశారు. పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరచాడమే కాకుండా భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా తల్లిదండ్రులతో పాటుగా జన్మనిచ్చిన ఊరికి సైతం మంచి పేరు తీసుకురావాలని వారు సూచించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటుగా పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లతా గంగాధర్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**వెల్దండ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**వెల్దండ మండలంలోని పెద్దాపూర్‌లో కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని వైద్యులతో కలిసి సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ, ఉపసర్పంచ్ ప్రసాద్‌లు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత నిరుపేదలకు కామినేని ఆసుపత్రి వారు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించడం మంచి పరిణామని నిరుపేదలకు వైద్య అందించిన కామినేని ఆసుపత్రి బృందానికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కామినేని ఆసుపత్రి వారు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి వైద్యబృందం దేవేందర్, హారిక, హరీష్ రెడ్డి, వార్డుసభ్యులు అనిల్‌కుమార్, నిరంజన్, తిరుపతి, శ్రీధర్ గౌడ్, అంజయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## పింఛన్ ఆలస్యంపై ధన్వాడలో మళ్లీ రాస్తారోకో

**నెల చివరైనా జమ కాక పోవడంతో ఆగ్రహం**

**గతంలోలాగే ఆలస్యం అవుతుందేమోనని లబ్ధిదారుల ఆందోళన**

**ధన్వాడ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ధన్వాడలో గత రెండు రోజుల క్రితం అధికారుల హామీతో ధర్నా విరమించిన వృద్ధులు, వికలాంగులు మళ్లీ ఆందోళనకు దిగారు. పింఛన్ డబ్బులు ఆలస్యమవుతుండటంతో చేయూత లబ్ధిదారులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ ముందు మెయిన్ రోడ్డు మరికల్ నారాయణపేట్ రోడ్డుపై బైఠాయించడంతో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. నెల చివరి రోజు దగ్గరపడినా పింఛన్ జమకాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గురువారంతో నెల పూర్తయింఇది. ఇప్పటికైనా డబ్బులు ఇవ్వండి" అంటూ వాపోతున్నారు. గతంలో కూడా ఇదే విధంగా ఒక నెల పింఛన్ ఆలస్యమైందని, మళ్లీ అలానే జరుగుతుందేమోనని భయపడుతున్నామన్నారు. గంటల తరబడి ఎదురు చూసినా డబ్బులు అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకుల్లో నగదు కొరత వల్ల ఆలస్యమైందని అధికారులు తెలుపగా, త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు జోక్యంతో ఆందోళన విరమించారు.


ఆందోళన నిర్వహిస్తున్న పెన్షన్‌దారులు

## నూతన కలెక్టర్‌కు సన్మానం

**కొల్లాపూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన హేమంత్ కేశవ్ పాటిల్ ని జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ని శాలువాతో సన్మానించి పర్యాటకశాఖ డైరీని జిల్లా పర్యాటక శాఖ అధికారి అందజేశారు. జిల్లాలో ఉన్న పర్యాటక రంగం గురించి, సోమశిలలో ఎన్నో అద్భుతమైన, ఆహ్లాదకరమైన ప్రదేశాలు గట్టులమధ్య కృష్ణ నదిలో టూరిజంబోటింగ్ ప్రయాణం గురించి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి కల్వరాల నరసింహని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డిఓ బన్సీలాల్, తహసిల్దార్ మాధవి, సోమశిల గ్రామ సర్పంచ్ కాటం వెంకట లక్ష్మి, వెంకటస్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానయ్య, సోమశిల జీపీఓ కురుమయ్య తదితరులు ఉన్నారు.


నూతన కలెక్టర్‌కు డైరీ అందజేస్తున్న దృశ్యం

## పదవ తరగతి టాపర్లకు ఘన సన్మానం

**కృష్ణ, ఏప్రిల్30 ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం కృష్ణ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు కుసుమూర్తి గ్రామంలో ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి నిజాముద్దీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కృష్ణ సబ్ ఇన్‌స్పెక్టర్ నవీద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలోనే కృష్ణ మండలం ప్రథమ స్థానంలో నిలవడం పట్ల వక్తలు హర్షం వ్యక్తం చేశారు. టాపర్లుగా నిలిచిన విద్యార్థులను శాలువాలతో సన్మానం చేసి, నగదు బహుమతులు, ఫిజిక్స్ పుస్తకాలను అందజేశారు. విద్యార్థులు జీవితంలో స్థిరపడే వరకు నిరంతర సహాయం అందిస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మండల విద్యాశాఖ తరఫున గౌరవించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోనేష్, గ్రామస్తులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నాగరాజు, అర్జున్, కుర్మయ్య, నరేందర్, రమేష్, శివరాజ్, శాలిని, శ్రీనివాస్, సూర్యకాంత్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పదవ తరగతి టాపర్లను సన్మానించిన దృశ్యం

## అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అచరించాలి

**వెల్దండ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ చల్లపల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పకాడి బసవయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణను విశారదన్ మహరాజ్ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్, అంబేద్కర్ వాది బైరి నరేష్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి జోగు రమేష్‌ల చేతుల మీదుగా అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యత వంటి విలువలను సమాజంలో ప్రతిష్టించాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మత భేదాలను పక్కనబెట్టి ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో జీవించే సమాజ నిర్మాణమే అంబేద్కర్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రసాద్ గౌడ్, మాజీ ఎంపిపి జయప్రకాష్, చెర్కూర్ సర్పంచ్‌లు బచ్చలకూర శ్రీనివాస్, గున్నేళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ హనుమంత్ నాయక్, మాజీ సర్పంచ్ ఉప్పు అపర్ణ తిరుమలరావు, మాదిగల ఐక్యవేదిక మండలాధ్యక్షులు సామెల్, ప్రధాన కార్యదర్శి మల్లేష్, వెంకటయ్య, దాన్సింగ్, అంజయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పకాడి రామాంజనేయులు, విజయ్ కుమార్, జగదీష్, జలందర్, రవి, పకాడి శశికుమార్, ఆనంద్, పర్వతాలు, భాస్కర్ బాబురావు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

# నేడు మేడే..

**కార్మికులకు పండుగ.. కార్మికులకు పండగ...**

**కాగితాల్లోనే అభివృద్ధి..బతుకులు మారని బడుగు,జీవితాలు**

**నర్వ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం ఆర్థిక సంక్షోభ పర్యావరణాలకు వ్యతిరేకంగా భారీ ఎత్తున విధుల్లో మోహరించనున్న సందర్భమే మేడే కార్మికుల దినోత్సవం. గత కొన్నేళ్లుగా పెట్టుబడిదారి సంక్షోభం అనేక రూపాల్లో కార్మిక వర్గాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. ప్రపంచంలోని కార్మికులు పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా, తమ హక్కుల రక్షణ కోసం మేడే ఒక అవకాశాన్ని కల్పించింది. పెట్టుబడిదారి విదానము నయా ఉదారవాదనకు సర్వ శక్తివంతమైనది. కొన్ని జాతీయ సంఘటనలు సమాజానికి పర్వదినాలు అవుతాయి. కొందరు మహానీయులు రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రక రోజులుగా మారుస్తారు. మేడే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో ఉన్న కొంతమంది రక్త తర్పణం చేసి కేవలం తమ దేశంలో ఉండే కాకార్మికవర్గానికె కాకుండా కొత్త వెలుగులు అందించారు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేము మనుషులమే మా శక్తికి కూడా పరిమితులు ఉంటాయి. ఈ చాకిరి మేము చెయలెమని పనిముట్లు కింద పడేసి 8 గంటల పనిదినము కోసం పోరాడటం చివరికి ప్రానాలను సైతం త్రునప్రాయంగా పెట్టడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి ఇంకా ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్నవి పోరాటం ద్వారా సాదించుకున్నారు. మే దినోత్సవం లేదా మేడే (ట్బ్యీ డ్బ్యీ) ప్రతి సంవత్సరం మే 1వ తేదీన జరుపుకునే స్మారక దినం. ప్రజా


కార్మికుల దినోత్సవం (లోగో)

సెలవుదినం. చాలా దేశాలలో మే దినం, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం లేదా కార్మిక దినోత్సవంతో ఏకీభవిస్తాయి. ఇవి అన్నీ కూడా కార్మికుల పోరాటం, కార్మికుల ఐక్యతను గుర్తిస్తాయి. కొన్ని పురాణగాథలు కొన్ని రోజులను పండుగలుగా మార్చాయి. కొన్ని జాతీయ సంఘటనలు ఆ సమాజానికి పర్వదినాలు అవుతాయి. కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రాత్మక రోజులుగా మారుస్తారు. మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో వున్న కొంతమంది రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే, మా శక్తికి కూడాపరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని పని ముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడటం, చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి (రెస్టు), ఇంకా ఎనిమిది గంటలు రిక్రీయేషన్ అన్నవి ఈ పోరాటం ద్వారా సాధించుకున్నారు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత కలిగిన మార్పు.

## పిఎండిడికేవైలో గద్వాల జిల్లా ముందుండాలి

**గద్వాల ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎండీడీకేవైలో జోగులాంబ గద్వాల జిల్లా ముందుండేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పిఎండిడికేవై (ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన) అమలుపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. డేటా ఆధారిత పాలన ద్వారా జిల్లాలో అభివృద్ధిని వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి శాఖ తమ పనితీరును ఖచ్చితమైన సంఖ్యలతో ప్రతిబింబిస్తూ, లక్ష్యాలు, సాధించిన ఫలితాలను సరిగ్గా నిర్దేశిత పోర్టల్ లో నమోదు చేయాలని సూచించారు. "సున్నా" నమోదు చేయకుండా, చేసిన ప్రతి పనిని డేటాలో చూపించాలని, చిన్న పురోగతినైనా నమోదు చేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చి ప్రస్తుత పురోగతిని చూపించడం ద్వారా పనితీరు మెరుగవుతుందని, ప్రతి నెల సమీక్ష ద్వారా డేటాను సరిచేసుకుంటే నివేదికలు మరింత నాణ్యతగా ఉంటాయని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, పథకం సూచికలను సక్రమంగా అమలు చేస్తే, ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరుతాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, డిఆర్డిఓ ముషాహిదా బేగం, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, జిల్లా ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ సమ్మర్ కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలి

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్**

**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:** బాలికల సాధికారత, ఆరోగ్యం, విద్య, భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించేలా స్నేహ సమ్మర్ ప్రోగ్రామ్స్‌ను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ తన చాంబర్లో మే 2వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్న కిషోర బాలికల స్నేహ సమ్మర్ క్యాంప్స్ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్నేహ సమ్మర్ క్యాంపు ప్రోగ్రామ్‌ను షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. బాలికల సాధికారత, ఆరోగ్యం, విద్య, భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై అవగాహన కల్పించేలా ప్రతి కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా బాల్య వివాహాల నివారణ, అనీమియా నివారణ, సైబర్ భద్రత, విద్యా కొనసాగింపు, కెరీర్ మార్గదర్శకత్వం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలను గ్రామ స్థాయిలో విస్తృతంగా చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, అన్ని కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి తేదీకి అనుగుణంగా బాధ్యతలు తీసుకుని, లక్ష్యిత ఫలితాలు సాధించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ ఉమాదేవి, డిడబ్ల్యూఓ సుధారాణి, డిఎంహెచ్ఓ సాయినాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## నూతన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు సన్మానం

**- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ కేశవ్ పాటిల్‌ను నాగర్‌కర్నూలు జిల్లా తెలంగాణ నాన్ వెజిటేడ్ ఉద్యో గులు (టీఎన్జీవో) సంఘ బాధ్యులు జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గౌరవ కలెక్టర్ టీఎన్జీవో చరిత్ర గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నా రు. జిల్లా అభివృద్ధికి ఉద్యోగులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో కార్యదర్శి షర్ఫుద్దీన్, కోశాధికారి బాలరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ గోదరాజు, వైస్ ప్రెసిడెం ట్ చెన్న కేశవులు, జాయింట్ సెక్రెటరీ శివరత్న, నాగర్‌కర్నూల్ యూనిట్ ప్రెసిడెంట్ నజీర్, కల్వకుర్తి యూనిట్ ప్రెసిడెంట్ సురేష్ గౌడ్, కార్యదర్శి ప్రమోద్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి నరేందర్ రెడ్డి, మహేష్, ఇతర జిల్లా సంఘం బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.


కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు బావండ్ల వెంకటేష్

## ముగిసిన ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

**వెల్దండ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఇంటర్వ్యూలు బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్నా 184 మంది లబ్ధిదారులు 79 మంది మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరయ్యారని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఆయా బ్యాంక్ మేనేజర్ సిద్ధం చేస్తారని ఎంపీడీఓ పేర్కొన్నారు. జిల్లా అధికారుల ప్రతిపాదన పంపించి మంజూరు పొందాల్సి ఉంటుందన్నారు.

**నూతన వధువరులను ఆశీర్వదించిన**

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

**కల్వకుర్తి, ఏప్రిల్30ప్రభాతవార్త:**హైదరాబాదులోని బిఎంఆర్ కన్వెన్షన్‌లో జాతీయ బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి కుమారుని వివాహ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

**ఇందిరమ్మ నూతన గృహప్రవేశంలో**

## పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి


ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణం 3 వ వార్డుకు చెందిన జుట్ల సరోజ ఆశప్ప నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి వాకిటి శ్రీహరి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆశప్ప దంపతులకు వాకిటి వారికానుకను అందజేసి వారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మూడవవార్డు కౌన్సిలర్ కే.మహేష్ కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గాయత్రి అనిల్ ,జుట్ల అంజప్ప, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**పాత గొడవలతో వ్యక్తి పై దాడి**

## కేసు నమోదు చేసిన పోలీసులు

**ఖిల్లా ఘనపురం ఏప్రిల్ 30, ప్రభాతవార్త;** మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన బంగారం రామాంజనేయులు ఉదయం తన వ్యవసాయ పొలం నుండి కట్టెలు తీసుకుని వస్తుండగా పాత కక్షలు మనసులో పెట్టుకొని బంగారం బావి ఆంజనేయులు, బంగారం బావి రామకృష్ణఇద్దరు కలిసి రామకృష్ణతో పాటు భార్యా మంజులను అడ్డుకొని దుర్భాషలాడి కర్రలతో తలపై కొట్టడంతో తలపై తీవ్ర గాయాలుకావాడంతో బాధితుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

**సొంత ఖర్చుతో సమ్మర్**

## క్యాంప్ నిర్వహిస్తున్న హెడ్మాస్టర్



సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్న హెచ్ఎంతో విద్యార్థులు

**కృష్ణ, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :**విద్యార్థుల భవిష్యత్తు కోసం కృష్ణ మండలంలోని హిందూపూర్ యూపీఎస్ పాఠశాల హెడ్మాస్టర్ ఉమేశ్వర్ ఆదర్శంగా నిలిచారు. తనసొంతఖర్చులతో ఉపాధ్యాయులను నియమించి పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. సుమారు 70మంది విద్యార్థులు పాల్గొంటున్న ఈ క్యాంప్‌లో తెలుగు, గణితం, హిందీతో పాటు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, హ్యాండ్ రైటింగ్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాన్ని ఎంఈఓ నిజాముద్దీన్ సందర్శించి, హెడ్మాస్టర్ అంకితభావాన్ని అభినందించారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఉమేశ్వర్ చేస్తున్న కృషిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ అమీన్ రెడ్డి పాల్గొన్నారు.

## స్త్రీ చైతన్యంపై విశిష్ట పరిశోధన

**పిహెచ్‌డీ పొందిన కె. శ్రీలతను అభినందించిన విసి శ్రీనివాస్**


**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :**పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ఇంగ్లీష్ విభాగంలో దశాబ్ద కాలానికి పైగా అధ్యాపకురాలిగా సేవలందిస్తున్న డా.కె.శ్రీలతకు పిహెచ్‌డీ అవార్డును గురువారం పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ నిర్వహించారు. రిటైర్డ్ ప్రొ॥.గుదూరు మనోజ పర్యవేక్షణలో డా.కె.శ్రీలత స్త్రీ చైతన్యం, మహిళా సాధికారత, సామాజిక స్పృహ వంటి అంశాలపై లోతైన పరిశోధన చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. ముఖ్యంగా సమకాలీన భారతీయ సాహిత్యంలో మహిళల జీవిత పోరాటాలు, ఆత్మగౌరవం, అణచివేతకు వ్యతిరేకంగా వారి స్వరాన్ని ప్రతిబింబించే రచనలను ఆమె పరిశోధనలో విశ్లేషించారు. రాణి శివశంకర శర్మ రచించిన ది లాస్ట్ బ్రాహ్మిన్, బేబీ కాంబ్లే రచించిన ది ప్రిజన్స్ వి బ్రోక్, టిజెఎస్. జార్జ్ రచించిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి : ది డెఫినిటివ్ బయోగ్రఫీ వంటి ప్రముఖ గ్రంథాలలో ప్రతిఫలించిన మహిళా ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం, స్త్రీ భావజాలం, స్వీయ గుర్తింపు కోసం మహిళలు చేసిన పోరాటాన్ని విశ్లేషించినట్లు డా. శ్రీలత తెలిపారు.


పిహెచ్‌డీ పొందిన కె. శ్రీలతను అభినందిస్తున్న విసి శ్రీనివాస్

మహిళల జీవిత అనుభవాలు సమాజ నిర్మాణంలో ఎంతటి ప్రభావాన్ని చూపుతాయో తమ పరిశోధన ద్వారా వెలుగులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. డా. కె. శ్రీలత తల్లిదండ్రులు డా.కే.బి ఆచార్య వసుంధర తమ ప్రాథమిక విద్యను హైదరాబాద్‌లోని మాడపాటి హనుమంతరావు పాఠశాలలో పూర్తి చేశారు. అనంతరం రెడ్డి ఉమెన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తి చేసి, సెట్ పరీక్షలో అర్హత సాధించారు. విద్యా రంగంపై ఆసక్తితో 2017లో పాలమూరు యూనివర్సిటీలో పిహెచ్‌డీ ప్రవేశం పొంది పరిశోధనను కొనసాగించారు. విద్యా, సాహిత్య రంగాలపై తమకున్న ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. వీరి తల్లిదండ్రులు డా. కె.బి. ఆచార్య ,వసుంధర. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సాధికారత, సామాజిక చైతన్యం వంటి అంశాలపై జరుగుతున్న పరిశోధనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. డా. శ్రీలత పరిశోధన సాహిత్య రంగానికి విలువైన తోడ్పాటుగా నిలుస్తుందని అభినందించారు. డా. కె. శ్రీలత మాట్లాడుతూ తన పరిశోధన ప్రయాణంలో నిరంతరం మార్గనిర్దేశం చేసిన పరిశోధన పర్యవేక్షకులు ప్రొ. గుదూరు మనోజ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ కుటుంబ సభ్యులు, సహచర అధ్యాపకులు, స్నేహితులు అందించిన సహకారం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగినట్లు పేర్కొన్నారు. పరిశోధన ద్వారా మహిళా చైతన్య అంశాలను సమాజానికి మరింత చేరువ చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డా. కె. ప్రవీణ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగానికి చెందిన ఎక్స్టర్నల్ ఎగ్జామినర్ డా. జే. భీమయ్య, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, ఇంగ్లీష్ విభాగాధిపతి డా. జె. మాళవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి. కల్పన, డా. ఎం.వి. సిద్ధార్థ తదితరులు పాల్గొని డా. కె. శ్రీలత ను అభినందించారు.

# ప్రజా పాలన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి

- ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా పాలన లక్ష్యం
- ప్రజా పాలన కార్యక్రమాల్లో శాఖల సమన్వయం కీలకం
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్30 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లావ్యాప్తంగా గ్రామ, మండల స్థాయి సమావేశాలు విజయవంతంగా నిర్వహించబడినట్లు, ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయడం,వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించే వేదికగా ప్రజా పాలన సభలు ఉపయోగపడుతున్నాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మే2వ తేదీన నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను అత్యంత విజయవంతంగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్,అచ్చంపేట,కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన సభలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలోనిఅన్ని మండలాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను ఆయా నియోజకవర్గాల ఆర్డీవోలకు వెంటనే అందజేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిని సూచించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇప్పటికే నిర్వహించిన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, అదే ఉత్సాహంతో నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలను కూడా విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులను ఆహ్వానించి ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో నిర్వహించే సభలు క్రమబద్ధంగా, సమగ్రంగా జరిగేలాముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌళిక వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి,వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని, సభల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండాలని కలెక్టర్ హితవు పలికారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సభలకు హాజరయ్యే ప్రజలు,ప్రజాప్రతినిధులకు తాగునీటి వసతి తో పాటు స్నాక్స్ మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆర్డీవోలను కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఆర్డీవోలు కీలక పాత్ర పోషించాలని, ప్రతి అంశాన్ని సమగ్రంగా పర్యవేక్షిస్తూ కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి నిరక్ష్యం చోటుచేసుకోకుండాచూడాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తికి ఘనంగా వీడ్కోలు



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మల్లేష్

**కల్వకుర్తి, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జిగా పనిచేస్తున్న జె కావ్యబదిలీ అయ్యారు.గత మూడు సంవత్సరాలుగా న్యాయమూర్తిగా పనిచేసిన కావ్య హైదరాబాద్ కూకట్‌పల్లి జూనియర్ సివిల్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వీడ్కోలు సన్మానం సభ కోర్టు ఆవరణలో నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.మల్లేష్, ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో సీనియర్ సివిల్ కోర్టుకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గౌరవ న్యాయమూర్తి ఎం.రాజు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కే.శ్రీనివాస్, కోర్టు సీనియర్ న్యాయవాదులు చిందం కృష్ణయ్య, జి.వెంకట్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, వెంకటరమణ, నరేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు న్యాయమూర్తి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా బదిలీ అయిన న్యాయమూర్తి కావ్య మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో తనకు సహకరించిన న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా ఏర్పాటు చేయడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణ, జయంత్ కుమార్, మల్లేష్, రామ్‌గోపాల్,శ్రీకాంత్, శివకుమార్,ప్రశాంత్, కృష్ణ, ఆంజనేయులు, సీనియర్ కోర్ట్, జూనియర్ కోర్టు, ఆమనగల్ కోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది క్లర్కులు,కల్వకుర్తి, వెల్దండ సీఐలు,కల్వకుర్తి వంగూరు, చారకొండ, వెల్దండ, ఊర్కొండ ఎస్సైలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మూడవత్ దీప్లా నాయక్‌కు బిఆర్ఎస్ నాయకుల పరామర్శ



**జడ్చర్ల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** నేలబండాతండాకు చెందిన ముడావత్ దీప్లానాయక్ జడ్చర్ల పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డు ప్రమాదంలోగాయపడగా, ఎస్వీఎస్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య, ముడా మాజీ డైరక్టర్ ఇంతియాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ తౌర్యానాయక్, రాజ్ నాయక్ తదితరులు పరామర్శించారు.

## పాలమూరు రన్ విజయవంతం చేద్దాం

**జడ్చర్ల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** జడ్చర్లలో మే 3న నిర్వహించే పాలమూరు రన్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. జడ్చర్లలోని డాక్టర్ బి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ మినీ స్టేడియంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 2, 3, 5 కిలోమీటర్లతో మూడు విభాగాల్లో నిర్వహించే రన్‌లో పాల్గొనే యువకులు క్రీడాకారులు రూ.99 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రన్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికి టీ షర్ట్ తో పాటు బ్రేక్ ఫాస్ట్, ప్రశంసా పత్రం కూడా అందజేయనున్నట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రన్ లో పాల్గొని స్ఫూర్తి నింపాలని కోరారు.

## సిఎల్ఆర్ చాంపియన్స్ ట్రోఫీ

- రేపటి నుంచి జడ్చర్ల నియోజకవర్గంలో క్రికెట్ సందడి
- కీ.శే.చర్లకోల శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహణ
- మొదటి బహుమతి రూ.లక్ష



కీ.శే.చర్లకోల శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించనున్న క్రికెట్ టోర్నీ

**జడ్చర్ల, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గంలో క్రికెట్ సందడి మొదలు కానున్నది. మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి సతీమణి కీ.శే చర్లకోల శ్వేతారెడ్డి జ్ఞాపకార్థం సిఎల్ఆర్ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. జడ్చర్లలోని హౌసింగ్ బోర్డ్ వద్ద ఫీచర్ సిటీ దగ్గర పోటీలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం నుంచి క్రికెట్ టోర్నీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జట్టును నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన మొదటి విజేతకు రూ. లక్ష, రెండవ బహుమతి రూ.50 వేలు ప్రైజ్ మనీ అందజేయనున్నారు.ఆసక్తిగల టీమ్‌లు7794908751, 7095675237, 9676119320 ,7207382834, 9581234723 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## 88 నుంచి 94 దాకా..

**మహబూబ్‌నగర్ జిల్లాలో పెరుగుతూ వస్తున్న పదో తరగతి ఉత్తీర్ణత శాతం**

**మహబూబ్‌నగర్, ఏప్రిల్30 ప్రభాతవార్త:** గత ఐదు సంవత్సరాలుగా మహబూబ్‌నగర్ జిల్లాలో పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతూ వస్తున్నది. 2022లో 88.47 ఉత్తీర్ణత సాధించగా, 2023లో 71.25 , 2024లో 89.47, 2025లో 91.91 సాధించగా ఇటీవల ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా 94.57 ఉత్తీర్ణత శాతం సాధించినట్లు జిల్లావిద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.జిల్లాలోని చాలా స్కూళ్లలో 100% ఫలితాలు కూడా వచ్చాయని ప్రతి ఏడాదికి ఫలితాలు మెరుగుపడుతున్నందుకు ఉపాధ్యాయ బృందాన్ని డిఈఓ అభినందించారు.

## ఈశ్వర ఆంజనేయ స్వామి జాతరలో పాల్గొన్న ఎర్ర శేఖర్

**మరికల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** మరికల్ మండలం పెద్ద చింతకుంట గ్రామం లో శ్రీశ్రీశ్రీ ఈశ్వరాంజనేయ స్వామి వారి జాతర మహోత్సవ కార్యక్రమంలో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌పాల్గొని (జాతర) బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజ చేశారు. ఆంజనేయ స్వామి వారి ఆశీర్వాదాలు సకల జనులు అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలతో వెల్లి విరియాలని ప్రార్థిస్తూ స్వామి వారి ని ప్రార్థించారు.ఈ సందర్భంగా హాజరైన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ను శాలువాతో సన్మానించారు.

## మెప్మా ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను

**మద్దూరు, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రేణివట్లలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎస్. శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యశ్రీ శంకర్ రెడ్డి, తహసిల్దార్ మహేష్ గౌడ్, ఏపిఎం కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు దళారుల మోసాలకు గురికాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెప్మా కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల ప్రకారం ఏగ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కురూ.2,389,బీగ్రేడ్ ధాన్యానికి రూ.2,369 చెల్లించబడుతుందని తెలిపారు. అదనంగా సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్, హమాలీలకు క్వింటాల్‌కు రూ.40 చెల్లింపు అందజేయబడుతుందని పేర్కొన్నారు. అనంతరం అధికారులు మండలంలోని అప్పిరెడ్డిపల్లి, చెన్నారం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించి,రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూళ్ళ నరసింహులు, ఢిల్లీకర్ జనార్ధన్, అశోక్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామంలో నేడు జరగనున్న జాబ్‌మేళాకు కావాల్సిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## నేడు మెగా జాబ్ మేళా

- 100 ఐటి, నాన్ ఐటి, ఫార్మా , ఇతర కంపెనీల ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- 10వ తరగతి పెయిల్ అయిన విద్యార్థుల నుండి బి.టెక్ ,ఫార్మా, ఇంటర్, డిగ్రీ, పి.జి. చదివిన విద్యార్థులు అర్హులు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యువత సద్వినియోగం చేసుకోండి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- శిల్పారామంలో అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలన

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 30 ప్రభాతవార్త:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర యువజన, క్రీడల శాఖ,పరిశ్రమలు,ఐ.టి.మంత్రిశ్వాఖల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా మెగా జాబ్ మేళాను మే 1వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శిల్పారామంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, వినిధ శాఖల అధికారులతో కలిసిశిల్పారామంను సందర్శించి మెగా జాబ్ మేకా నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా తో మాట్లాడుతూ మే 1న నిర్వహించబోయే జాబ్ మేళా, తెలంగాణలోనే తొలిమెగా జాబ్ మేళా అని తెలిపారు.మెగాజాబ్ మేళా లో సుమారు 100ఐటి.,నాన్ ఐటి.,ఫార్మా ,ఇతర కంపెనీలు పాల్గొని విద్య,అర్హతలు ననుసరించి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తారని,అదే రోజు సాయంత్రం ఎంపికైన అభ్యర్థులకు నియామక ఆఫర్ లెటర్ లు అంద చేస్తారని తెలిపారు. 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల నుండి బి.టెక్.,ఫార్మా,ఇంటర్,డిగ్రీ,పి.జి.చదివిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా యువత మెగా జాబ్ మేళా లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇందులో 37 స్థానిక కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. అభ్యర్థులు క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ నుండి రిజిస్ట్రేషన్ చేసుకొని నేరుగాపాల్గొన వచ్చని తెలిపారు. శిల్పారామంలో 30 రిజిస్ట్రేషన్ డెస్క్ లు ఏర్పాటు చేస్తున్నట్లు,రిజిస్ట్రేషన్ డెస్క్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్ చేసుకొని అభ్యర్థులు వారి విద్యార్హతలు బట్టి ఏర్పాటు చేసిన 100 కంపెనీల లో స్టాల్ లలో వారికి ఇష్టమైన కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. కంపెనీలు స్టాల్ నెంబర్‌లు కేటాయించి వాటి వివరాలు ప్లెక్సీ ద్వారా ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారుఎంపికైన అభ్యర్థులకు అదే రోజున నియామక ఆఫర్ లెటర్ అందచేయడం జరుగుతుందని తెలిపారు.

**శిల్పారామంలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సుమారు 10,000 మంది నిరుద్యోగ యువతి యువకులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.జాబ్ మేళా ఏర్పాట్లపై రెవెన్యూ,మున్సిపల్, యువజన సర్వీసులు, క్రీడలు, పరిశ్రమలు, పంచాయతీ శాఖ, విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి,, ఉపాధి కల్పన,వైద్య శాఖ,విద్యా శాఖ,సంక్షేమ శాఖల అధికారులకు జాబ్ మేళా ఏర్పాట్లకు సంబంధించి చెవలసిన పనులు, కార్యక్రమాలపై సూచనలు చేశారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ లు ఏర్పాటు పై రద్దీ లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ఏర్పాటు చేయాలని అన్నారు. క్యూఆర్ కోడ్ ప్లెక్సీలు శిల్పారామంలో పలు చోట్ల ఏర్పాటుకు ఆదేశాలు జారే చేశారు. వేసవి కనుక టెంట్లు, కుర్చీలు, టేబుళ్లు, త్రాగు నీటి వసతి, మరుగుదొడ్లు, వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే స్టేజీ ఏర్పాటు, స్టాల్‌లలో కావలసిన ఏర్పాట్లను రెవెన్యూ, జిల్లా విద్యా శాఖ అధికారులు చూసుకోవాలని అన్నారు. మేళా లో సుమారు 103 స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. శిల్పారామంలో విఐ పి పార్కింగ్,జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులకు ట్యాంక్ బండ్ పై టూ వీలర్, ఫోర్‌వీలర్ పార్కింగ్‌కు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు.జిల్లా పంచాయతీ శాఖపంచాయతీ కార్యదర్శులను, ఇతర సిబ్బందిని అందుబాటులోఉంచుకోవాలని,జాబ్ మేళాకు వచ్చే అభ్యర్థుల నమోదు ప్రక్రియనువీరి సహకారంతో వేగవంతం చేయాలని సూచించారు. సూచించారు. ఎన్ఐసి అధికారులకు సరైన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, వైద్యశాఖను మెడికల్ క్యాంప్‌ఏర్పాటు చేయా లని ఆదేశించారు.ఈ కార్యక్రమంలోస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధు సూదన్ నాయక్,అదనపుఎస్‌పి.ఎన్‌బిరత్నం, పరిశ్రమల శాఖ జిఎం యాదయ్య, రాష్ట్ర యువజన,క్రీడల శాఖ డిడి శ్రీనివాస్, డిఎం హెచ్‌ఓ డా.కె.కృష్ణ, డిఆర్‌డిఓ నర్సింహులు, డిఈఓ ప్రవీణ్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి రామ్మోహన్,వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు జాబ్‌మేళా

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు
- ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు అవకాశం
- నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**నారాయణపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. మే 1వ తేదీన ఉదయం 9గంటలకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేళాలో నారాయణపేటతో పాటు మహబూబ్‌నగర్, గద్వాల,నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు మే 23న నియామక పత్రాలు అందజే యనున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మార్చి 6 నుంచి జూన్ 12వరకు అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామీణ స్థాయిలోఅవగాహన పెంపొందించడం, యువజన,క్రీడా రంగాల బలోపేతం లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మే 18 నుంచి 23 వరకు యువజన, క్రీడలపై వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఇదిలా ఉండగా, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీన నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, అదనపు కలెక్టర్(రెవెన్యూ) శ్రీను తెలిపారు.ఈ సమావేశాల్లోప్రభుత్వ సంక్షేమపథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు,రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతి వంటి అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలపైఅవగాహన కల్పించడం,స్థానిక సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని వివరిం చారు.ప్రజాప్రతినిధులు అధికారులు, రైతులు,మహిళా సంఘాలు యువత పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధికార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు.

## సొంతింటి కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)



వృద్ధురాలితో మాట్లాడుతున్న జీఎంఆర్

ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంతోనే సాకారం అవుతుందని, దేవరకద్ర నియోజకవర్గంలో పండగలా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, బస్వాయిపల్లి సర్పంచ్ శివ కుమార్, ఉపసర్పంచ్ గోవర్ధన్, గ్రామ అధ్యక్షులు విక్రం రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తీర్చలేదని వ్యక్తిపై దాడి


**నవాబుపేట, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :** రూ. 12 వేల అప్పు తీసుకున్న వ్యక్తి అప్పు తీర్చడంలో జాప్యం కావడంతో అప్పు తీసుకున్న వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండల పరిధిలోని చెన్నారెడ్డి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం చిన్నారెడ్డి పల్లి గ్రామానికి చెందిన బడుగుల శ్రీనివాసులుకు అదే గ్రామానికి చెందిన బడుగుల కేశవులురూ. 12,000 అప్పుగా ఇచ్చాడు. తిరిగి చెల్లించడంలో ఆలస్యం కావడంతో ఆగ్రహంతో బడుగుల శ్రీనివాసులు పై కేశవులు అతని సన్నిహితులు శ్రీనివాసులును తోటకు పిలిచి ముఖంపై రాయితో గాయపరచగా సమాచారం తెలుసుకున్న బాధితుడి భార్య పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## జిల్లాలో విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు కృషి

(మొదటి పేజీ తరువాయి)

తమ మాతృభాష ఫినిష్‌తో పాటు జర్మన్, ఆంగ్ల భాషలు నేర్చుకుంటున్నట్లు చెప్పారు. ప్రాజెక్ట్ వర్క్‌తోపాటు, లెసన్ ప్లాన్లను పక్కాగా అనుసరిస్తూ అక్కడి విద్యార్థులకు ఉత్తమమైన విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. ఫిన్లాండ్ దేశంలో అనుసరిస్తున్న విద్యా వ్యవస్థను స్ఫూర్తిగా తీసుకుని జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఇఓ విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి మైఖేల్, టిజిఈడబ్ల్యూఐడిసి ఏఈలు మోహన్ రెడ్డి, ఆజాం, తదితరులు పాల్గొన్నారు.

## నియామక ఉత్తర్వులు జారీ



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :** వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టలకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కుష్బూ గుప్తా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి కారుణ్య నియామక అభ్యర్థులనురోస్టర్ ప్రకారం పారదర్శకంగా అర్హులైన 6 జూనియర్ అసిస్టెంట్‌లు, ఐదుగురు ఆఫీస్ సబార్డినేట్ లను నియామకం చేస్తూ కేటాయింపు ఉత్తర్వులు జారీ చేశారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ,డిఆర్‌ఓ రాంరెడ్డి,షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి డి.సునీత,జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏఓ జనార్ధన్, కలెక్టరేట్ ఏఓ సువర్ణ రాజ్ ఉన్నారు.

## హోరాహోరీగా..

### సెమీ ఫైనల్‌కు జట్లు



మూడు వికెట్లు తీసిన విష్ణు (ఉత్తరప్రదేశ్)

**జడ్చర్ల, ఏప్రిల్30, ప్రభాతవార్త:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్ వర్సెస్ ఉత్తరాఖండ్ మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీల్లో ఉత్తరప్రదేశ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని మొదటి ఇన్నింగ్స్ లో 19.5 ఓర్లలో 108 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. 19 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఉత్తరాఖండ్ జట్టు 6 వికెట్లు కోల్పోయి 17.4 ఓర్ల లో 112 పరుగులు చేసి విజేతగా నిలిచింది. దీంతో ఉత్తరాఖండ్ జట్టు సెమిస్ కు చేరుకుంది. జమ్మూ కాశ్మీర్ వర్సెస్ డిఏవిసిఎంసి మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ పోటీల్లో టాస్ గెలిచి జమ్మూ కాశ్మీర్ బౌలింగ్ ఎంచుకున్నది. డిఏవి సిఎంసి జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 15 ఓవర్లలో 141 పరుగులు చేసింది. 142 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జమ్మూకాశ్మీర్ 15ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసింది. దీంతో డిఏవి సిఎంసి జట్టు కూడా సెమిస్‌కు చేరుకుంది. ఒడిస్సా వర్సెస్ ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో ఉత్తరప్రదేశ్ చెట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసింది.125 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒడిశా కేవలం 72 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. దీంతో ఉత్తరప్రదేశ్ చెట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. విష్ణు మూడు వికెట్లు హర్ష యాదవ్ మూడు వికెట్లు తీసుకున్నారు.జార్ఖండ్ వర్సెస్ డిఏవి మధ్య జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్‌లో ఝార్ఖండ్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నది. ఏవి సిఎంసి జట్టు నిర్ణీత 15ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. 116 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నిర్ణీత 15 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 1015 పరుగులు చేయడంతో మ్యాచ్ టైగా నిలిచింది. దీంతో సూపర్ ఓవర్ తో బరిలోకి దిగిన జార్ఖండ్ జట్టు 17 పరుగులు చేయక తర్వాత డిఏబి సిఎంసి జట్టు 17 పరుగులు ఛేదించి విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం



29 బాల్స్‌లో 57 రన్‌లు సాధించిన స్వస్తిక్